రూ.1.53 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని వివిధ వార్డులో సోమవారం 1.53 కోట్ల మున్సిపాలిటీ సాధారణ నిధులతో అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీలో దశలవారిగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రహదారులు, అండర్‌డ్రైయినేజీ పనులకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైఎస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, నాయకులు మురళి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాడర్ నుంచే లీడర్లను తయారు చేసుకుందాం


ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్ ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్‌రావును సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మన వెంటే ఉన్నారని, రాబోయే రోజుల్లో తిరిగి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను మణికొండ మున్సిపాలిటీలోనే ఉంటున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అవసరం ఉన్నా తన వద్దకు రావచ్చన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు సీతారాం, కౌన్సిలర్ నవీన్ కుమార్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు విజయలక్ష్మి, లక్ష్మయ్య, రాజేంద్రప్రసాద్, బాబు, దిలిప్‌కుమార్, భాను, ఉపేంద్రనాథ్ రెడ్డి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేయాలంటూ వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హనుమాన్‌నగర్, పత్తికుంటలో వినాయక నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయాలని వినాయక ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ రవి కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై గతంలో ఇచ్చిన వినతి మేరకు సర్కిల్ ఈఈ నరేందర్ గౌడ్ ఆదేశానుసారం రెండు రోజుల పాటు చెరువును శుభ్రం చేశారన్నారు. ఇంకా చెరువుతో పాటు పాండ్‌ను శుభ్రం చేయాల్సి ఉందన్నారు. పత్తికుంట చెరువులోని నీరు బయటికి పోకుండా కాపాడాలని, లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. సెప్టెంబర్ 7వ తేదీన వినాయక ఉత్సవాల్లోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి కార్యదర్శి జోగి రవి తదితరులు ఉన్నారు.

సొంత నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ తన సొంత నిధులతో 3.5 లక్షలతో ఎన్ఎఫ్‌సీ కాలనీలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు, నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ముఖ్యమన్నారు. దుకాణాలు, ఇండ్ల వద్ద, ప్రధాన చౌరస్తాలు, కాలనీలు, బస్తీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తాననన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సైబరాబాద్ సీపీ, శంషాబాద్ డీసీపీ ఆదేశాల మేరకు ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు పర్యవేక్షణలో వందమంది పోలీసులు ఒకేసారి వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని లాడ్జీలు, పాన్‌డబ్బాలు, దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలు పాన్‌డబ్బాల్లో నిషేదిత గుట్కాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించేందుకు విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ప్రజావాణి.. 13 వినతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. పింఛన్లకు 7, టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, శానిటేషన్ 1, ఇంజనీరింగ్ విభాగానికి 1 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

జాతీయ రహదారిపై నిత్యం రద్దీ

- హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలంటున్న ప్రజలు
- పీరంచెరువు కమాన్ వద్ద యూటర్న్‌తో ట్రాఫిక్ జామ్‌లు
- ప్రజల అవసరాల నిమిత్తం ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను నిర్మించాలి


పీరంచెరువు ప్రాంతంలో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పై నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. గతంలో ఖాళీగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులన్ని రద్దీగా మారిపోయాయని, రోడ్డు వెడల్పు పనులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. గంటల తరబడి రోడ్డుపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతుండడంతో పాటు ప్రమాదాలు సైతం అధికంగా జరుగుతున్నాయి.

రోడ్లపైనే వ్యాపారులు...

టిప్పుఖాన్ బ్రిడ్జీ నుంచి ఆరెమైసమ్మ దేవాలయం వరకు వెళ్లే హైదరాబాద్–బీజాపూర్ రహదారి కిక్కిరిసి కనిపిస్తుంది. దీనికితోడు రోడ్డుకు ఇరువైపుల అనేక షాపింగ్ మాల్స్, దుకాణాలు ఉండటంతో పాటు రోడ్లపైనే అనేక మంది వ్యాపారాలు కొనసాగిస్తుంటారు. దీంతో రోడ్డు పూర్తిగా కుచించుకుపోయింది. రోడ్డు వెడల్పు పనులను చేపట్టి రోడ్డును విస్తరించాలని పలుమార్లు కోరిన అధికారుల్లో మాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

కమాన్ వద్ద యూ టర్న్ మూయాలి...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు వద్ద ఉన్న యూ టర్న్ కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. బండ్లగూడ నుంచి ఆరెమైసమ్మ వైపు వచ్చే వాహనాలు ఈ ప్రాంతంలో యూటర్న్ చేసుకోవడంతో ట్రాఫిక్ జామ్‌లు అధికంగా జరుగుతున్నాయి. అప్పా చౌరస్తా నుంచి మొదలుకోని పీరంచెరువు వరకు ట్రాఫిక్ ఏర్పడుతుందని వాహనాదారులు, ప్రజలు వెల్లడిస్తున్నారు. గతంలో ఈ యూటర్న్‌ను మూసి వేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపినప్పటికీ, అది జరగలేదని, దీంతో ఎప్పుడు చూసిన ట్రాఫిక్ జామ్, ప్రమాదాలతో సతమతమవుతున్నామని ప్రజలు వెల్లడిస్తున్నారు.



ప్రమాదభరితంగా రోడ్డు దాటుతున్న మహిళలు

ప్రమాదభరితంగా రోడ్లు దాటుతున్నారు..

ఎప్పుడు రద్దీగా ఉండే హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు రోడ్డును ప్రమాదభరితంగా దాటుతుండడంతో వాహనాదారులు వారిని ఢీకొంటున్నారు. బండ్లగూడ, హైదరాబాద్, సన్‌సిటీ తదితర ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు పనులను చేపట్టి పుట్‌ఓవర్ బ్రిడ్జీలను నిర్మిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని ప్రజలు కోరుతున్నారు.

జాయ్‌ఫుల్ లర్నింగ్ శిక్షణ

అత్తాపూర్: నేతాజీ నగర్, శ్రీరామ్‌నగర్ కాలనీ, మధుబన్ కాలనీ, పద్మాలిపురం, గణేష్‌నగర్ పాఠశాలలను సోమవారం రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్ రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50శాతం మంది ఉపాధ్యాయులు ట్రైనింగ్‌లో ఉన్నారని, రేపు 50 శాతం మంది ఉపాధ్యాయులు ట్రైనింగ్ పొందుతారని తెలిపారు. ఈ ట్రైనింగ్ లెవెల్ వన్ ఒకటి రెండు తరగతులు, లెవెల్ టూ మూడు నాలుగు తరగతులకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ ట్రైనింగ్‌లో విద్యార్థి జాయ్ ఫుల్‌గా ఏ విధంగా నేర్చుకోవాలో ఉపాధ్యాయులకు తెలియజేస్తారని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను తప్పకుండా విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యబోధన చేయాలని కోరారు.


రికార్డులను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి శంకర్ రాథోడ్


మీటింగ్‌లో హాజరైన ఉపాధ్యాయులు

పంట రుణాల పంపిణీ

శంషాబాద్: మండలంలోని చిన్నగోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 22 మంది రైతులకు సోమవారం రుణాలను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ దొనాకర్‌గౌడ్ చేతుల మీదుగా మొత్తం 15.85 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరక్టర్లు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పోటీలలో పాల్గొనండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని హుడాకాలనీ, ఎంప్లాయిస్ కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో 14వ తేదీన మున్సిపాలిటీ పరిధిలోని క్రీడాకారులు, మహిళలు, మున్సిపల్ కార్మికులు, సీనియర్ సిటిజన్స్‌కు పలు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని ఆయా కాలనీల నాయకులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు పోటీలు మర్రిచెట్టు సమీపంలోని మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో ఉంటాయని, పాల్గొనేవారు ఫోన్ 9110743946 నెంబరుపై సతీష్‌కుమార్‌ను సంప్రదించాలని కోరారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు


ఐటీజోన్‌కు వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షం నీరు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు, ఔటర్ సర్వీసు రోడ్డు నుంచి ఐటీ జోన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయ్యాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సోమవారం చెరువును తలపించింది. మూడు అడుగుల మేర వర్షం నీరు రోడ్డుపై నిలవటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైన్ పూర్తిగా పూడుకుపోవటంతో వర్షం నీరంతా రోడ్డుపై నిలిచిపోయాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవలే మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి నిలిచిన నీటిని శుభ్రం చేశారు. అయినప్పటికీ లోతట్టుగా ఉన్న చోట పట్టించుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలంటూ ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలి


మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

మణికొండ: ప్రతి ఇంట్లో వీలైనన్ని ఎక్కువ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు ఆరోగ్యంగా ఉండాలని కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన వార్డు పరిధిలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ తరఫున లక్షల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేయటంతో పాటు పార్కులు, రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలను నాటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మాల్యాద్రి నాయుడు, శ్రావణ్ కుమార్, ఆరీఫ్‌లతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఈదులకుంటను కాపాడాలి

శేరిలింగంపల్లి: ఖానామెట్‌లోని ఈదులకుంటను ఆక్రమణల నుంచి కాపాడాలని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజన్సీ (హైడ్రా) కమిషనర్ రంగనాథ్‌కు సీపీఎం శేరిలింగంపల్లి కార్యదర్శి సి.శోభన్ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఖానామెట్ సర్వే నంబర్ 7లోని ఈదులకుంట 6 ఎకరాల 5 గుంటలు ఉన్నప్పటికీ, కుంటను పూడ్చివేసి ఆక్రమించారని వివరించారు. తమ్మిడి చెరువు నాలా నుంచి ఈదులకుంటకు వచ్చే వరదను మళ్లించారని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాణిక్యం, కృష్ణ, వరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి

గచ్చిబౌలి: జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. సోమవారం టీయూడబ్ల్యూజే–ఐజేయూ శేరిలింగంపల్లి నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే–ఐజేయూ నాయకులు కొండా విజయ్‌కుమార్, సలీమ్‌పాషా, అశోక్‌యాదవ్, ప్రణయ్ ముదిరాజ్, శ్రీనివాస్, మల్లేష్, వరుణ్, గోవర్ధన్‌రెడ్డి, నాగరత్నం, మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రసాద్, సత్యనారాయణ, అనిల్‌రెడ్డి వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గర్భిణీలు ఆరోగ్య సూచనలు పాటించాలి


సాముహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

శంషాబాద్: స్థానిక అంబేద్కర్ బస్తీలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సాముహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. గర్భిణీ స్త్రీలు వైద్యులు సూచించిన ఆరోగ్య సూచనలు పాటించాలని కౌన్సిలర్ వై.కుమార్ సూచించారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత కీలకం

రాయదుర్గం: సమాజాభివృద్ధిలో యువత కీలకం అని వక్తలు పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆదేశంపై విద్యార్థులలో మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీడీఐ విద్యార్థులచే మాదక ద్రవ్యాలను వినియోగించమని, స్నేహితులు, తోటివారిని కూడా వినియోగించకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులలో డ్రగ్స్ వినియోగం లేకుండా చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. మన జిల్లా, రాష్ట్రం మాదకద్రవ్యరహిత ప్రాంతాలుగా మారేలా మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం


రూ. 8లక్షల చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

మణికొండ: మణికొండ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని 10 సంవత్సరాలు పూర్తైయిన సందర్భంగా ఆర్క్ సర్వ్ సంస్థ సీఈఓ క్రిస్ బాబెల్ విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమయ్యే ట్యాబ్‌లతో పాటు ఉపాధ్యాయుల నియామకానికి అయ్యే ఖర్చు కోసం రూ.8 లక్షల చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కుష్వంత్ రణచంద్ర వర్మ, భార్గవి, మిర్యామిలను అభినందించి వారికి ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా ఉండి వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించటంతో పాటు వారిని ప్రోత్సహిస్తామన్నారు. తమ ప్రోత్సాహంతో గత రెండు సంవత్సరాలుగా విద్యార్థుల సంఖ్య పెరగటంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఈవీపీ మైఖేల్ లిన్, వైస్ ప్రెసిడెంట్ జీఎం అంబరీష్‌కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కరుణ గడ్డం, ఫెసిలిటీస్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్, సీఎస్‌ఆర్ లీడ్ స్వాతి, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేయాలి


రోడ్డు పనులను పరిశీలించిన చైర్మన్, నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు, లక్ష్మీప్రియ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పునులు, దళిత శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణం, రోడ్డును సోమవారం మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీప్రియ కాలనీలో ఇటీవల డ్రైనేజీ, నీటి సరఫరా, కేబుల్ పనులు జరగటంతో రోడ్డు పూర్తిగా పాడయ్యిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించే ప్రసక్తే లేదని, పూర్తి స్థాయి పర్యవేక్షణతో పనులు చేయించాలని ఏఈ సంజయ్, కాంట్రాక్టర్ వెంకన్నకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, వసంతరావు, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు శ్రీరాములు, యాలాల నరేష్, ముత్యాలు, సాయిరెడ్డి, శ్రావణ్‌కుమార్, లక్ష్మన్, ఆరీఫ్, ప్లెజెంట్ వ్యాలీ కాలనీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

వనమహోత్సవం


వన మహోత్సవంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రాజేంద్రనగర్: పచ్చదనం పెంపొందించే ఉద్దేశ్యంతో సోమవారం రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధన సంస్థ, నేల ఆరోగ్య యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు పరిశోధన సంస్థల్లో పని చేసే శాస్త్రవేత్తలు, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేల యజమాన్య సంస్థ హేడ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మాధవి, ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఆర్.జి.వర్మ, వరి పరిశోధన సంస్థలో పని చేసే శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణ, చంద్రమోహన్, పవన్‌చంద్రారెడ్డి, సుకృల్ కుమార్, కిరణ్ బాబు, నాన్ టీచింగ్ సిబ్బంది రాజు, నర్సింగ్ రావు, అంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సాక్షి సిటీబ్యూరో: బద్రీవిశాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్–అగ్రవాల్ సేవా దళం ద్వారా, మహారాణా ప్రతాప్ సేవా కమిటీ అత్తాపూర్ సహకారంతో 132వ ఉచిత మెడికల్ క్యాంప్‌ను అత్తాపూర్ పాండురంగనగర్‌లోని భానోదయ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ శిబిరం భగవాన్ మహావీర్ వికలాంగ్ కమిటీ హైదరాబాద్, మెడికవర్ హాస్పిటల్ బేగంపేట, ఎల్‌సీఎస్ దండు ఐ ఇనిస్టిట్యూట్ వెస్ట్ మారేడ్‌పల్లి సహకారంతో నిర్వహించబడింది. మెడికోవర్ హాస్పిటల్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎల్ఎన్ ప్రసాద్, ఈసీజీ బీపీ చెకప్, ఆర్బీఎస్ బీఎండీ సపోర్ట్ స్టాఫ్ నరేంద్ర–టీం లీడర్, నర్సింగ్ స్టాఫ్ అఖిల–సాంగీత, రిజ్వానుల్ హక్ తమ సేవలను అందించారు. శిబిరంలో ఎల్‌సీఎస్ దండు ఐ ఇనిస్టిట్యూట్ వెస్ట్ మారేడ్‌పల్లి డాక్టర్లు 125 మంది ఉచిత కళ్లజోళ్లతోపాటు 9 మందికి ఉచిత ముత్యబిందు ఆపరేషన్‌ని ఏర్పాటు చేశారు.



నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది

రాయదుర్గం: మనం నిబద్ధతతో పని చేస్తూ ముందుకు సాగాలని, గుర్తింపు అదే వస్తుందని కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వి వెంకయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలి మనూలోని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్‌స్కీమ్‌ల సహకారం, యూజీసీ మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక(ఐడీపీ) వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ఒక ప్రయాణమని, అది గమ్యం కాదన్నారు. అత్యంత ప్రతిభావంతమైన విద్యాసంస్థల్లో నిలబడటానికి వ్యూహం రూపొందించుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రహమాన్ మాట్లాడుతూ మనూ 2022లో ఏప్లస్ గ్రేడ్‌ను పొందిందన్నారు. కార్యక్రమంలో మనూ రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ అలోసియస్ సిక్వేరా, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ అమన్ ఉబేద్ పాల్గొన్నారు.

రెడీమిక్స్ లారీ బోల్తా..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని లక్ష్మీవిహార్ కాలనీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున రెడీమిక్స్ లారీ బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. లారీని తొలగించేందుకు రెండు గంటలకు పైగా సమయం పట్టిందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆఫీసులు, స్కూల్స్ సమయం కావడంతో నల్లగండ్ల సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్ అయింది.

శాంటామారియా విద్యార్థుల ప్రతిభ

శేరిలింగంపల్లి: అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఐఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్ వేసవి శిబిరంలో శాంటామారియా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ శిబిరానికి వివిధ దేశాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధన, సహకారం, దౌత్యంపై చర్చ జరిగింది. ఇందులో శాంటామారియా విద్యార్థులు ధృతి, మోహినీష్‌లు ప్రతిభ కనబరిచారు.

అదుపు తప్పిన ట్రాలీ ఆటో.. పాదచారి మృతి

గచ్చిబౌలి: వాటర్ క్యాన్‌ల లోడ్‌తో అతి వేగంగా వెళుతున్న ట్రాలీ ఆటో పల్టీ కొట్టడంతో అటుగా వెళుతున్న ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం ముజఫర్‌నగర్‌కు చెందిన ముఖేష్ కుమార్ మిశ్రా(32) ఆర్ఎంజడ్ బిల్డింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. హఫీజ్‌పేట్‌కు చెందిన సోఫియా వాటర్ డిస్ట్రిబ్యూటర్ రమేష్ వద్ద బిహార్‌కు చెందిన ఆదిల్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ట్రాలీ ఆటోలో వాటర్ క్యాన్‌లు తీసుకొని సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో మై హోం భూజ నుంచి లింకు రోడ్డులో ప్రధాన రహదారి వైపు అతి వేగంగా వెళుతుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అటుగా నడుచుకుంటూ వెళుతున్న పాదచారి ముఖేష్ కుమార్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ఆదిల్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.